క్లుప్తంగా

'భగీరథ' లీకేజీని పరిశీలించిన కలెక్టర్



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

మెట్‌పల్లి: మిషన్ భగీరథ పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే తక్షణమే మరమ్మతు చేపట్టాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. పట్టణ శివారులో ప్రధాన పైపులైన్ మరమ్మతు పనులను మంగళవారం పరిశీలించారు. లీకేజీలను వేగవంతంగా.. నాణ్యతగా మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజు నీటి సరఫరా జరగాలని, ఇందుకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ రఘువరన్, మున్సిపల్ కమిషనర్ మోహన్, భగీరథ ఈఈ శేఖర్‌రెడ్డి, డీఈ ప్రేమ్‌కుమార్ ఉన్నారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన

ధర్మపురి: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎలా స్పందించాలో వివరిస్తూ పట్టణ ప్రజలకు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం మంగళవారం ధర్మపురిలో అవగాహన కల్పించారు. పట్టణంలోని గోదావరి తీరంలో పలు రకాల ప్రమాదాలపై మాక్ డ్రిల్ నిర్వహించి ప్రదర్శించారు. భూకంపం,వరదలు,అగ్ని ప్రమాదాలు వంటివి సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రదర్శించి చూపారు. కొన్ని ముందస్తు జాగ్రత్తలతో ఆస్తి, ప్రాణ నష్టాలను గణనీయంగా తగ్గించవచ్చని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఎంపీడీవో రవీందర్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ధర్మపురి/గొల్లపల్లి: ధర్మపురి, గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్లలో మంగళవారం మార్క్‌ఫెడ్ అధికారి రామకృష్ణా రెడ్డి కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటాలు కందులకు రూ.7550 గా ప్రభుత్వం మద్దతు ధరను నిర్ణయించిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ అడిషనల్ బిజినెస్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి,ఏఎంసీ కార్యదర్శి భూమన్న,పర్యవేక్షకులు వెంకటనర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులు క్రీడల్లో పాల్గొనాలి

జగిత్యాల: విద్యార్థినులు క్రీడల్లో పాల్గొనాలని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత అన్నారు. జిల్లా కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో మహిళ శిశు సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సాధికారత కేంద్ర బృందం గౌతమి, స్వప్న పాల్గొన్నారు.

గోవుల సంరక్షణ మనందరి బాధ్యత

జగిత్యాలటౌన్: గోవుల సంరక్షణ మనందరి బాధ్యత అని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి బిట్టు అన్నారు. రాత్రి వేళల్లో రోడ్లపై సంచరించే ఆవులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు మంగళవారం ఆవులకు రేడియం బెల్టులు తొడిగారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గాజోజు సంతోష్, బజరంగ్‌దళ్ టౌన్ కన్వీనర్ పాదం మహేందర్, కోకన్వీనర్ విశ్వనాథ్, గోరక్ష ప్రముఖ్ దుర్గం కృష్ణ, సేవా ప్రముఖ్ రాజ్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

మల్లాపూర్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు టీయూడబ్ల్యూజే హెచ్-143 రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుల రాంగోపాల్, జిల్లా అధ్యక్షుడు శికారి రామకృష్ణ అన్నారు. మల్లాపూర్ ప్రెస్‌క్లబ్‌లో టీయుడబ్ల్యూజె హెచ్-143 మహా సభల వాల్ పోస్టర్లను సీనియర్ జర్నలిస్టు, కోరుట్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముక్కెర చంద్రశేఖర్, ఎలాక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు దొమ్మాటి అంజుగౌడ్‌తో కలిసి వారు ఆవిష్కరించారు. జర్నలిస్టుల హక్కులను సాధించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తించేయడంలో టీయుడబ్ల్యూజె హెచ్-143 ముందుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముత్యాల రమేష్, కనుక సంజీవ్, ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఒంటికి, రెంటికి తిప్పలే..



మున్సిపల్ కార్యాలయం వద్ద తాళం వేసిన మరుగుదొడ్డి



మున్సిపల్ పార్కు వద్ద..

మెట్‌పల్లి: ప్రజలకు ముఖ్యంగా మహిళల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రద్దీగా ఉండే ప్రాంతంలో స్వచ్ఛ భారత్ నిధులతో పట్టణంలోని ఎనిమిది చోట్ల పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. అయితే ఏడాది కాలంగా కూబొసింగ్ కుంట పార్కు, మున్సిపల్ కార్యాలయం, ఆరపేట, మండల పరిషత్‌లో ఉన్న టాయిలెట్లు నిరుపయోగంగా ఉన్నాయి. కాంట్రాక్టర్లకు మున్సిపల్ నుంచి బిల్లులు రాకపోవడంతో వాటికి తాళాలు వేసినట్లు తెలిసింది. పట్టణ ప్రజలు ఇబ్బంది పడుతున్నా.. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.



ఆరపేట హైవే వద్ద ..



మండల పరిషత్ వద్ద ..

కథలాపూర్: మండలం పోసానిపేట గ్రామపంచాయతీ కార్యాలయం పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించి చదును చేయించారు. ఈ నెల 2న సాక్షి దినపత్రికలో 'విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు' పేరిట ఫొటో వార్త ప్రచురితమైంది. స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ సిబ్బందితో చదును చేయించారు.



విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి నారాయణ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండలంలోని 8 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు మంగళవారం ప్రజ్ఞా పాటవ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు డబ్బులు వృథా చేసుకుని, ప్రయివేటు కళాశాలలో చేరకుండా ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలని సూచించారు. ఈ ప్రజ్ఞా పాటవ పోటీల్లో ప్రథమ బహుమతి ఇబ్రహీంపట్నం మోడల్‌స్కూల్, రెండో బహుమతి జెడ్పీహెచ్‌ఎస్ వేములకుర్తి, మూడో బహుమతి కేజీబీవీ విద్యార్థులు గెలుపొందగా వారికి బహుమతులు, మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంజీవ్‌తో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు అశోక్, రమేశ్, రవి, మహేశ్, రంజిత్, అజయ్, మహేశ్ కుమార్, కళాశాల అధ్యాపకులు, బహుమతుల స్పాన్సర్ తిమ్మని అరుణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి

మేడిపల్లి: భీమారం మండలం కమ్మరిపేటలో భైర లింగన్నకు చెందిన గొర్రెల మందపై సోమవారం అర్ధరాత్రి కుక్కలు దాడి చేయగా 30 గొర్రెలు మృతి చెందాయి. మరో 15 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. వాటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ఘటనాస్థలాన్ని మండల పశు వైద్యాధికారి రాజేందర్ రెడ్డి పరిశీలించి గాయపడిన గొర్రెలకు చికిత్స అందించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తాండ్రియాల శివారులో పేకాట స్థావరంపై సోమవారం రాత్రి జగిత్యాల సీసీఎస్ పోలీసులు దాడిచేశారు. రహస్యంగా పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.16 వేల నగదును స్వాధీనం చేసుకుని కథలాపూర్ పోలీసులకు అప్పగించారు.

ట్రాక్టర్ బోల్తా, ముగ్గురికి గాయాలు

రాయికల్: మండలంలోని భూపతిపూర్ గ్రామ శివారులో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి వాసరి రాయమల్లు, దనరేకుల రాజు, ఏనుగు తేజలకు తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన వాసరి రాయమల్లు కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లి నుంచి మంగళవారం గొర్రెలకు పల్లికట్టలు తీసుకువస్తుండగా మండలంలోని భూపతిపూర్ ఎక్స్‌రోడ్ వద్ద ఓవర్‌లోడ్‌తో ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడింది. వీరికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.

క్యాన్సర్ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీవో మమత

రాయికల్: క్యాన్సర్ నివారణకు ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని సీడీపీవో మమత అన్నారు. మంగళవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా రాయికల్ పట్టణంలో అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు, ఉప్పుమడుగు గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో క్యాన్సర్ వ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శోభరాణి, అంగన్‌వాడీ కార్యకర్త రాజేశ్వరి, ఏఎన్‌ఎం సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని దమ్మన్నపేట అంగన్‌వాడీ కేంద్రంతో పాటు, వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రపంచ క్యాన్సర్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, గర్భిణులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. క్యాన్సర్ నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లులు, కిశోర బాలికలకు ఆహార ప్రాముఖ్యతపై తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సైండ్ల రజిత, ఆశా వర్కర్ గాలి జమున,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రథసప్తమి వేడుకలు

కోరుట్ల: పట్టణంలోని అతి పురాతన శ్రీ వేంకటేశ్వర ఆలయంలో రథ సప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సారంగాపూర్: రథ సప్తమి సందర్భంగా బీర్‌పూర్ మండలం తుంగూర్ సూర్య దేవాలయంలో రథసప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి, భక్తులు అన్నప్రసాదం అందజేశారు.

పెగడపల్లిలో డప్పు చప్పుళ్లతో ర్యాలీ

పెగడపల్లి: ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'లక్ష డప్పులు వేల గొంతులు' సభకు మాదిగలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎంఆర్పీఎస్ నాయకులు కోరారు. పెగడపల్లిలో మంగళవారం వంద డప్పులతో భారీ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో నాయకులు బాబు, అమర్‌నాథ్, మహేందర్, అక్కెనపల్లి కుమార్, లక్ష్మీరాజం, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

మేడిపల్లి: ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు.. వేల గొంతులు కార్యక్రమ వాల్ పోస్టర్లను మంగళవారం మండల కేంద్రంలోఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దోనపాల శంకర్, నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మకిలీ ఇజ్రాయిల్, బంగారు దీపక్ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయాలి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కథలాపూర్: మండలంలో రెండో విడత దళితబంధు పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేయాలని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో రెండో విడత దళితబంధు పథకం కింద మండలంలో 60 మందిని ఎంపిక చేశారన్నారు. అప్పటి వేములవాడ ఎమ్మెల్యే రమేశ్ బాబు లబ్ధిదారుల జాబితాను జిల్లా కలెక్టర్‌కు అందించారన్నారు. ఎన్నికల కోడ్‌తో నిధులు రాలేదని, ఈ విషయంలో అధికారులు న్యాయం చేయాలని కోరారు.

పశువులతో ఇబ్బందులు

ధర్మపురి: పట్టణంలో స్వైరవిహారం చేస్తున్న ఆవులు,కుక్కలు,కోతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వీటిపై తగిన చర్యలు తీసుకోవాలని మండల యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. పశువుల విచ్చలవిడి సంచారంతో వ్యాపారులు,దుకాణాదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అప్పం తిరుపతి, జంజీరకాని గణేష్,రాపర్తి సాయికిరణ్,జంజీరకాని భరత్,షౌకత్,తరుణ్,ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల చేయూత

వెల్గటూర్ : ఎండపల్లి ఎంపీపీఎస్‌లో స్కావెంజర్‌గా విధులు నిర్వహిస్తున్న కనుకుట్ల నీలమ్మ కుమారుడు రవితేజ ఇటీవల రోడ్డు ప్రమాదంలో వెన్నెముకకు తీవ్ర గాయమై నడవలేని స్థితిలో ఉండగా, విషయం తెలుసుకున్న వివిధ మండలాలకు చెందిన ఉపాధ్యాయులందరూ కలిసి ఎంఈవో రాంచంద్రం,హెచ్ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ. 63 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రవీందర్ రెడ్డి, రాజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేటీ బచావో బేటీ పడావోపై అవగాహన

రాయికల్: మండలంలోని అల్లీపూర్ పీహెచ్‌సీలో బేటి బచావో బేటి పడావోపై అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ సమీన మాట్లాడుతూ మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలు అందించే సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం టీం సభ్యులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



జగిత్యాలలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: వ్యక్తిగత పన్ను మినహాయింపు రూ.12 లక్షలకు పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు మంగళవారం జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమానికి హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రావణి మాట్లాడుతూ దేశం యావత్తూ కేంద్ర బడ్జెట్‌ను ప్రశంసిస్తుంటే చూసి ఓర్చుకోలేని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు బడ్జెట్‌పై విమర్శలు చేస్తున్నాయన్నారు. బడ్జెట్‌లో చిన్న పరిశ్రమలకు ఆపన్నహస్తం అందించి మోదీ ప్రభుత్వం యువతకు అండగా నిలిచిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ ఊసేలేదనడం కాంగ్రెస్ నేతల అవగాహనా రాహిత్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో నాయకులు నలువాల తిరుపతి, గంగాధర్, జుంబర్తి దివాకర్, దశరథరెడ్డి, సిరికొండ రాజన్న, దూరిశెట్టి మమత, మధురిమ, భానుప్రియ, కవిత, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మెట్‌పల్లి/ధర్మపురి: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల సంక్షేమానికి ఉపయోగపడేలా ఉందని హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని పాత బస్టాండ్ చౌరస్తా, ధర్మపురిలోని అంబేడ్కర్ చౌక్‌లో మంగళవారం బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జీ చెట్లపల్లి సుఖేందర్, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేష్‌లతో పాటు ఏలేటి నరేందర్‌రెడ్డి, కుమ్మరి తిరుపతి,పిల్లి శ్రీనివాస్,నలుమాసు వైకుంఠం,ఆకుల శ్రీనివాస్ముత్తయ్యరెడ్డి, బొడ్ల నగేష్, సుంకేట విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

రాయికల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో చిరంజీవి ఆధ్వర్యంలో వివిధ పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని 32 గ్రామపంచాయతీల్లో 276 వార్డుల ఓటరు ముసాయిదాను తయారు చేసి అభిప్రాయాలు సేకరించారు.

కథలాపూర్: ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించేందుకు వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో శంకర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. మండలంలో 19 గ్రామాల్లో ఓటరు జాబితాలను వార్డులవారీగా తయారు చేశామని, వీటిపై అభ్యంతరాలుంటే తెలపాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో ఎంపీవో రాజశేఖర్, నరేందర్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెగడపల్లి: ఓటరు జాబితాలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. ఓటర్ జాబితాలో అభ్యంతరాలుంటే ఈ నెల 6వ తేదీలోగా తెలియజేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మల్యాల: స్థానిక సంస్థల ఎన్నికల ఓటరు జాబితాలో అభ్యంతరాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంపీడీవో స్వాతి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎరువులు తక్కువ మోతాదులో వాడాలి

మేడిపల్లి: పంట పొలాల్లో ఎరువులు అవసరం ఉన్నంత మేరకే వాడాలని మండల వ్యవసాయ అధికారి షాహిద్ అలీ అన్నారు. భీమారం మండలం మోత్కురావుపేటలో వరి పొలాలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్, జనార్దన్, సతీష్, మహేష్ తదితరులు ఉన్నారు.

బీసీ కులగణన చరిత్రాత్మకం

కోరుట్ల: రాష్ట్రం ప్రభుత్వం నిర్వహించిన బీసీ కులగణన దేశంలోనే చరిత్రాత్మకమని జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్ గౌడ్ అన్నారు. పట్టణంలో మంళవారం మాట్లాడారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కులగణన చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్యూమరేటర్ల వేతనం విడుదల చేయాలి

వెల్గటూర్: ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లకు గౌరవ వేతనం చెల్లించాలని ఎండపల్లి మండల పీఆర్‌టీయూ నాయకులు ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నిమ్మ రవి, జోగం శ్రీనివాస సంతోష్, ధర్మేందర్, జగన్నాథరావు పాల్గొన్నారు.

సీఐకి వీడీసీ సభ్యుల సన్మానం

ఇబ్రహీంపట్నం: ప్రతిష్టాత్మక ఇండియన్ పోలీస్ మెడల్‌కు ఎంపికైన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి ని మంగళవారం గోధూర్ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు ఎడెపెల్లి వెంకటస్వామి, ఉపాధ్యక్షుడు తడిసిన ప్రవీణ్, కోశాధికారి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు విశ్వకర్మ యోజన కిట్లు

కథలాపూర్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన విశ్వకర్మ యోజన పథకం పనిముట్ల కిట్లు మంగళవారం అందాయి. విశ్వకర్మ యోజన పథకానికి పలువురు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుదారులకు కులవృత్తులపై శిక్షణ ఇచ్చారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక మొదటి విడతగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 13 మంది వడ్రంగి కులస్తులకు ఒకొక్కరికి రూ. 15 వేలు విలువ చేసే పనిముట్ల కిట్లు అందించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు గాంధారి శ్రీనివాస్, ముత్యాల మురళి, శ్రీగద్దె ప్రభాకర్, ముత్యాల అంజయ్య, నరేందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో సోమేశ్వర దీక్షలు

మల్లాపూర్: శ్రీ కనక సోమేశ్వర ఆలయంలో మంగళవారం భక్తులు సోమేశ్వర అర్ధ మండల దీక్షలు స్వీకరించారు. అర్చకులు బల్యాపెల్లి ప్రభాకర్ శర్మ దీక్షాధారణ చేశారు. గ్రామానికి చెందిన తోట రాజారాం దీక్షాదారులకు అన్నదానం చేశారు.



ఘనంగా ఎల్లమ్మ దేవి పట్నాలు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ పట్నాల మహోత్సవంలో మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



మల్లన్న జాతరలో అగ్ని గుండాలు

కోరుట్ల రూరల్: మండలంలోని సంగెంలో మల్లన్న జాతర ముగింపు ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు అగ్ని గుండంలో నడిచి వెళ్లి మల్లన్నను దర్శించుకున్నారు. మల్లన్న పట్నాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి.